# వాళ్లు తుపాకులతో చంపారు

# మనం మౌనంతో చంపుతున్నాం !



**వాళ్లు** చొక్కా అవసరం లేనంత పేదవాళ్లు. ఏ కులమో ఏ మతమో మనకు తెలీదు. మనలాగా పేపర్ చదివి, మనలాగా రాజకీయాలు చర్చించే మనుషులు కారు. మనలాగా కేరేజీ తీసుకుని స్కూటర్‌మీదో, కారులోనో ఆఫీసుకు వెళ్లే మనుషులు కాదు. మనలాంటి మధ్యతరగతి మర్యాదపురుషులు కానే కాదు. వాళ్లది మన భాష కాదు, మన రాష్ట్రమూ కాదు. వాళ్లు వేరే. వాళ్లు మనకు ఏలియన్స్ (పరాయివాళ్లు). అందుకేనేమో "భలే పని చేశారు గురూ, ఈ దెబ్బకు ఇక ఇటువైపు రారు" అనే మాట ఎక్కువగా వినిపిస్తోంది. మనందరి ఆస్తిని ఎవరో కొట్టేసుకుపోతూ ఉంటే పోలీసులు వారికి గట్టి బుద్ధి చెప్పినట్టుగా ఉంది.

**చెట్లు** కొట్టేయడం మనుషులను కాల్చి చంపదగిన నేరంగా ఎప్పుడు మారింది అని అడిగి లాభం లేదు. రాళ్లు విసిరితే తుపాకులతో కాల్చే యడం ఏ విధమైన ఆత్మరక్షణ లాజిక్ అని అడిగీ లాభం లేదు. ఆ శవాల పక్కనబెట్టిన దుంగలు ఎప్పటివో లాగున్నాయి, కొన్నింటిమీద పెయింట్ కూడా కనిపిస్తోంది అని ప్రశ్నించీ లాభం లేదు. ఇది ఎన్‌కౌంటరే అని నమ్మకం కలిగించాల్సిన అవసరం అంతగా లేదని, దాని కోసం కష్టపడనక్కర్లేదని పోలీసులు భావించినట్టు తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో పోలీసులకు తమ సివిల్ సొసైటీ మీదా, నాయకుల మీదా, న్యాయవ్యవస్థ మీదా నమ్మకం అంతగా పెరిగిపోయింది. ప్రజాస్వామ్య శక్తులు అంతగా బలాన్ని కోల్పోయాయి. ఈ పరిస్థితుల్లో రాజ్యాం గాన్ని, చట్టాన్ని కాపాడుతామని మనసావాచా కర్మణా ప్రమాణం చేసితిరి కదయ్యా అని పాలకులను ప్రశ్నించీ లాభం లేదు. అలాంటి ప్రశ్నలు వినపడే దూరంలో వారు లేరు. 'ముద్దు' మాటలు వినలేదా! 'బొజ్జల' వారి వివరణ చూడలేదా! అంతకుమించి అడవిలో కూలీలకేం పని అన్న వెంకయ్య నాయుడు ప్రశ్న చెవుల్లో గింగురుమనడం లేదా?

**అడవిలో** కూలీలకేం పని అనడంలో ఆధునిక ఆధిపత్య వ్యాపార శాస్త్రముంది. నేటి ప్రభుత్వాలకు అడవి ఆస్తి. వనరుల గని. ఆంధ్రప్ర దేశ్ రాష్ట్రప్రభుత్వానికైతే ఎర్రచందనం మరీ కల్పతరువులాగా కనిపిస్తున్న ఆస్తి. ఒక్క ప్రభుత్వానికే కాదు రాజకీయనాయకుల్లో చాలామం దికి ఇవాళ అడవి వేలకోట్ల డబ్బుల మూట. సారాయి వేలంపాటలు, రియల్ ఎస్టేట్లు, ప్రాజెక్టుల్లో కమిషన్ల మీదుగా ఎదిగిన రాజకీయ నాయ కత్వం చూపంతా ఇప్పుడు అడవులమీదా గుట్టలమీదా ఉంది. ఇది ఆస్తి కోణం. మైదాన ప్రాంతపు ఆధునిక వృత్తులు, పనులు తెలీని ఆదివా సుల్లో చాలామందికి అడవి ఉపాధి. తునికాకో మరో ఆకో అలమో కాయో పండో ఇచ్చే జీవన వనరు. వాలులో నాలుగు గింజలు వేసుకుంటే నాలుగొందల గింజలిచ్చి పొట్టనింపే ఉపాధి. అడవి వారి జీవనాధారం. జీవనాధారం చేసుకోవడంలో ఇపుడు చనిపోయిన 20 మంది చట్టా లను పట్టించుకోకపోయి ఉండొచ్చు. వారి జీవనాధారంలో నేరకోణం ఉండొచ్చు. కానీ ఆస్తి కోణం ఉన్నవారు అందుకోసమే వేల ఎకరాల్లో ఆ చెట్లను పెంచి నరికి అమ్ముకుంటామని ఇంతకు ముందు ప్రకటించారని గుర్తుంచుకోవాలి. అంటే ఏమిటి? ఇక్కడ సమస్య చెట్లను కొట్టడం కాదు. ఎవరు కొట్టాలి? ఎవరి ఆస్తి ఎవరు తరలించుకుపోతారు అనేదే సమస్య. అక్రమ కొట్టివేతా-సక్రమ కొట్టివేతా తప్ప కొట్టివేత అనేది దానికది నేరమనే భావన ఇక్కడ లేదు.

**ఆ మాటకొస్తే** నల్లమల కొండలకు ఆనుకుని ఉన్న కడప, ప్రకాశం జిల్లాల్లోని మైదాన ప్రాంతాల్లో చాలా ఇళ్లలో దూలాలు దంతెలు ఎర్రగా కనిపిస్తాయి. బండి గాండ్లు, ఇతరత్రా పరికరాలు కూడా ఎర్రచందనంవే ఉంటాయి. ఎక్కువగా దొరికే నాణ్యమైన కర్రగా మాత్రమే వారికి దాని గురించి తెలుసు. ఇపుడిపుడే దాని విలువ వారికి తెలుస్తున్నది. అది కర్ర కాదు, బంగారం అని అర్థమవుతున్నది. ఊ అంటే అడవిలోకి వెళ్లి నాలుగు కర్రలు నరుక్కొచ్చి ఇంటి పనికి ఉపయోగించిన తమ తాతలు తండ్రులు అన్నలు రాజ్యం చంపదగిన నేరాలు చేశా రని వారికి ఇపుడిపుడే అర్థమవుతోంది. కాని అది అంతపెద్ద నేరమెలా అయిందో వాళ్లకు తెలిసే అవకాశం లేదు. వస్తువు ఖరీదు పెరిగితే అది నేరమవుతుంది, ఆస్తి విలువ కొద్దీ నేర స్వభావం పెరిగిపోతుంది అనే లాజిక్ ఇపుడిపుడే అందరికీ అర్థం చేయిస్తోంది ప్రభుత్వం. ఆ రకమైన మెసేజ్‌ని పంపించాలని భావించింది ప్రభుత్వం. మెసేజ్‌ని జనంలోకి పంపించాలనుకున్నపుడు డిమాన్‌స్ట్రేషన్ ఎఫెక్ట్ యాడ్ చేయ గలిగితే అంతకు మించిన శక్తివంతమైన సాధనం ఉండదు. 20 మంది శవాలతో డిమాన్‌స్ట్రేషన్ చేశాక ఇంకెవరైనా గొడ్డలి పట్టుకుని అడవి లోకి అడుగుపెడతారా?

**ఆ 20 మంది** ఎవరో, ఎవరి కన్నబిడ్డలో, ఎవరు కట్టుకున్న భర్తలో! ఎవరైతే మనకేంటి? వాళ్లెవరో పరాయివాళ్లు. ఈ మనమూ, వాళ్లు అనేదాన్ని ప్రాంతం, కులం, మతం వస్త్రధారణ వంటివి నిర్వచిస్తాయి అనే మాట నిజమే కానీ అంతకు మించి నిజంగా నిర్వచించగలిగేది

ఆస్తి. వాళ్లు ఆస్తి లేని వాళ్లు. ఆస్తి ఉంటే ఈ పనికి ఎగబడరు, అంతమందిని రాజ్యం చంపే మాటా ఉండదు. అడవి ఆస్తిగా మారాక - అడవుల మీద రాజ్యానికి, రాజ్యంలో రక్షణ బాధ్యతలు చూసేవారికి గతంలో ఎప్పటికంటే అడవి పూర్తిగా మాదే అన్న సొంత భావన పెరిగిపోయింది. రివర్స్ లాజిక్‌లో ఆదివాసులకు అడవితో ఏం పని అనే రోజులొచ్చాయి.

**నిజమే.** వాళ్లు రాజ్యానికి చెందిన ఆస్తి అయినటువంటి చెట్లను నరికేశారు. వాళ్లు బండవాళ్లు, మొరటువాళ్లు. నిజమే; అలాగే ఆయా ప్రాంతాల్లో తిరిగి వారికి కౌన్సిలింగ్ ఇవ్వడానికి ప్రయత్నించిన వారితో కూడా మొరటుగా ప్రవర్తించిన దాఖలాలు ఉన్నమాట నిజమే; ఒకనాడు మన రాష్ట్రంలో స్టువర్ట్‌పురంగా పేరుపడిన సోకాల్డ్ 'నోటిఫైడ్' ప్రాంతాల లాంటి వారు అయిన మాట వాస్తవమే. కాని అందరమూ అక్కడినుంచి వచ్చినవారమే. మనిషి పుట్టుకతోనే బ్రాండెడ్ షర్టుతోనూ బ్రాండెడ్ ఉద్యోగంతోనూ పుట్టలేదు. అందరమూ అడవుల నుంచి ఆదిమ దశ నుంచి వచ్చినవారమే. దాటి వచ్చిన దశ పట్ల అంత వ్యతిరేకత ప్రదర్శించడం మన సమాజంలోని అప్రజాస్వామిక లక్షణాల్లో ఒకటి. అడవుల అందం పట్ల అంతులేని గ్లామర్, అక్కడి ప్రజల పట్ల అంతులేని చిన్నచూపూ ప్రదర్శించుకునే వాళ్ల సంఖ్య పెరిగిపోతున్నది. అడవి అనే ఆస్తి కావాలి. అడవి బిడ్డలు వద్దు. వాళ్లు ప్రజాధనాన్ని దోచుకోవాలనుకున్నారు కాబట్టి కాల్చేశామంటున్నారు కదా! అంతకంటే దారుణంగా కమిషన్ల రూపంలో లంచాల రూపంలో ప్రజాధనాన్ని టేబుల్ కిందినుంచో పైనుంచే తీసుకునే వాళ్లను ఇలాగే కాల్చేస్తే సివిల్ సొసైటీ ఇలాగే మౌనం వహిస్తుందా, భలే పని చేశారు గురూ అనగలుగుతుందా అని వాదనకోసమైనా అనలేం. రకరకాల రూపాల్లో ప్రభుత్వానికి రావాల్సిన పన్నులను నొక్కేసే తెల్లచొక్కాల మనుషులను ఇలాగే పట్టుకుని కాల్చి చంపేయగలరా అని అడగలేం. వాళ్లంతా భద్రజీవితంలో ఉన్నవాళ్లు.

**ఒక** రాజకీయ నాయకుడు, ఒక ఆఫీసర్ ప్రత్యక్షంగా దోపిడీ చేస్తూ పట్టుబడినా నేరం రుజువు కాకముందే నన్ను నేరస్తుడెట్లా అంటారు అని వైట్ కాలరెగరేసి మాట్లాడగలడు. మన భారత న్యాయవ్యవస్థ మీద నమ్మకం ఉంది అని గంభీరంగా మైకుల ముందు చెప్పగలడు. ఇపుడు చనిపోయిన 20 మంది ఉన్నారే వాళ్లు అలా చెప్పలేరు. వాళ్లకు మన వ్యవస్థ మీద అంత నమ్మకం ఉండదు. నమ్మకం ఎలా ఉంటుంది? పోలీసులు తప్ప మరో శాఖ ఆ తండాలను గ్రామాలను సందర్శించకుండా ఉన్నపుడు, బూతులు బెదిరింపులు తప్ప మరో మంచి మాట చెవి సోకనపుడు వారికి ఏ వ్యవస్థమీదైనా నమ్మకం ఎలా కలుగుతుంది? ఆయా ప్రాంతాలు దోపిడీ దొంగల ప్రాంతాలని, వీరప్పన్ ప్రభావిత ప్రాంతాలని ప్రచారం చేయడం వల్ల వాళ్లు వేరే అనే పరాయి భావనను అదే పనిగా జనంలోకి పంపించడం ఓ ఎత్తుగడ. ఈ ఎత్తుగడ కేవలం రాజ్యానిది మాత్రమే కాదు. ఆస్తిపరులందరిదీ. రాజ్యం కేటలిస్ట్ మాత్రమే కశ్మీర్‌ను ఎలాగైతే ఆస్తిగా చూసి అక్కడ తిరగబడే వారిని ఎంతమందిని కాల్చితే అంత సంతోషపడే స్వభావాన్ని పెంచుకున్నారో ఇప్పుడలాగే శేషాచలం అడవులను ఆస్తిగా చూపి ఆ ఆస్తిపై కన్నేసినా చేయేసినా చంపేయొచ్చనే భావనను మధ్యతరగతిలో పెంచగలుగుతున్నారు.

**మన దేశంలో** ప్రజాస్వామ్యం చిత్రమైనది. ఇది అవసరమైనపుడు నాలుగు పడగలు, పది తలలు తొడుక్కోగలదు. అది ఒకవైపు అమెరికాను ఆదర్శంగా చూపుతూ అక్కడ చూడండి రూల్ అంటే రూలే అనగలదు. ఏం కోర్టులండీ, కాల్చేస్తే గానీ బుద్ధిరాదు అని అదే నోటితో తాలిబన్ల లాజిక్ కూడా వినిపించగలదు. అప్పుడు ఆధునిక బూర్జువా రాజ్యం ఆదర్శం కాదు. ఎక్కడ ఏది అవసరమైతే అది అనే ప్రాతిపదికన ఈ రాజ్యం నడుస్తున్నది. తమకు అవసరమైనపుడు చట్టం ఒకటుంది కదండీ అనగలదు. అవసరం లేదు అనుకుంటే అన్నింటికీ చట్టాలంటే కుదరదండీ, పది మందిని వేసేస్తే గానీ పదకొండో మనిషికి తెలివి రాదు అనగలదు. రాజ్యాంగం రాసేటప్పుడు సూత్రబద్ధ వైఖరుల కోసం నాటి మేధావులు అనేకానేక రాజ్యాంగాల మీద ఆధారపడ్డారు. వివిధ దేశాల్లో కాలక్రమేణా ముందుకు వచ్చిన విలువలు, నాగరిక భావనల్నీ తీసుకునే ప్రయత్నం చేశారు. ఇవాల్టి నేతలు తమ అవసరాల కోసం, తమ క్రూరత్వాన్ని సమర్థించుకోవడం కోసం ఎక్కడెక్కడి అనాగరిక పద్ధతులనూ ఆదర్శంగా తీసుకుంటున్నారు.

**కానీ సమస్యలను** తుపాకీతో పరిష్కరించాలనుకునే దేశాలు ఏమయ్యాయో ఈ దేశపు పాలకులు తెలుసుకోవాల్సిన అవసరమైతే ఉంది. తుపాకీ తాత్కాలికంగా గ్లామరస్‌గా కనిపించొచ్చు, తక్షణ పరిష్కారంగా కూడా కనిపించొచ్చు గానీ అది పాలకులకు, ఈ వ్యవస్థకే ప్రమాదకరం అని గుర్తించాలి. ఆస్తి ప్రాతిపదికన మనుషులను శిక్షించదగినవారు - శిక్షించకూడని వారు, అందులోనూ చంపదగినవారు, చంపకూడని వారు అని విభజించే ఈ విచిత్రన్యాయం చాలా ప్రమాదకరమైనది. ఈ దేశపు పేదలు ఇవాళ తెలుగువారు, తమిళవారుగానో ఆదివాసులు, మైదానప్రాంతం వారుగానో చీలిపోయి ఉండొచ్చును. ఆర్థిక అంతరాల వల్ల పేదలు కూడా తమ కింద ఇంకా దరిద్రులున్నారనే భావనతో ఆధిక్యభావనలో ఉండొచ్చు. భద్రలోక భావజాలం అవసరమైన వారికంటే ఎక్కువమందిలో మాయలాగా కమ్మి ఉండొచ్చు. వారికి ఉమ్మడిగా గొంతునిచ్చే శక్తులు బలహీనంగా ఉండొచ్చును. కానీ ఏ బలహీనతా శాశ్వతం కాదు.

(9-4-2015 నాడు magazine.saarangabooks.com లో వచ్చిన జి.ఎస్. రామ్మోహన్ వ్యాసం)

**మానవహక్కుల వేదిక**
Human Rights Forum (HRF)

10-4-2015

ప్రచురణ కర్తలు : **ఎస్. జీవన్ కుమార్ – 98489 86286, వి.ఎస్. కృష్ణ – 94404 11899**